సాక్షి
వరంగల్
సోమవారం | 14 | ఏప్రిల్ | 2025



ఇల్లందలో గుడిసె దగ్ధం

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది. ఈ ఘటనలో బట్టలు, బియ్యం, నగదుతోపాటు సామగ్రి కాలిపోయాయి. - 8లో▸



మేడారంలో సండే సందడి

వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం మేడారానికి పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^{0}/25^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మామిడిలో జాగ్రత్తలు తీసుకోవాలి

దుగ్గొండి: మామిడి తోటల్లో తామర పురుగు, కాయతొలుచు పురుగు, పిందె రాలడం చాలా తీవ్రంగా ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. మండలంలోని ముద్దునూరు, చలపర్తి గ్రామాల్లో ఆదివారం ఆమె మామిడి తోటలను పరిశీలించి మాట్లాడారు. తామర పురుగుల నివారణకు పిప్రోనిల్ 40 గ్రాములు, 400 గ్రాముల సాఫ్ మందు, 400 మిల్లీలీటర్ల కార్బోసల్ఫాన్ మందులను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 10 సంవత్సరాలు దాటిన ఒక్కో చెట్టుకు 500 గ్రాముల యూరియా, కిలో పొటాష్‌ను వేసి నీరు పెడితే పిందె రాలే శాతం తగ్గుతుందని ఆమె తెలిపారు.

హత్య చేసిన ఇద్దరిపై కేసు నమోదు

నల్లబెల్లి: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతో మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన బానోత్ కొమ్మాలును హత్య చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హత్యకు గురైన బానోత్ కొమ్మాలు కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ మేరకు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసి మందలించి కొమ్మాలుకు జరిమానా విధించారు. అయినా వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో సదరు మహిళ తన భర్త జంపయ్యతో కలిసి కొమ్మాలును హత్య చేసింది. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు



ఐనవోలు: సూర్యుడు మీనరాశి నుంచి మేషరాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఆదివారం ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక సంక్రమణ పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు విక్రాంత్ వినాయక్ జోషి ఆధ్వర్యంలో స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిపించారు. అలాగే గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. కాగా.. ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి, ఒగ్గు కథలు చెబుతూ.. మల్లన్న కల్యాణంతో పాటు ప్రత్యేక ఒగ్గు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌డీఏ పరీక్ష



కేయూ క్యాంపస్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఆదివారం ఎన్‌డీఏ(నేషనల్ డిఫెన్స్ అకాడమీ) పరీక్షను నిర్వహించారు. ఈపరీక్ష కేంద్రాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై ఏర్పాట్ల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

హన్మకొండ చౌరస్తా: సేంద్రియ పద్ధతిలో పండించిన వాటిని తినాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి గ్రామీణ ఉత్పత్తుల సంతను ఆదివారం బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత జంక్‌ఫుడ్‌కు అలవాటు పడి అనేక వ్యాధులు కొని తెచ్చుకుంటోందన్నారు. జంక్‌ఫుడ్, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తెలంగాణ గ్రామ భారతి అధ్యక్షురాలు సూర్యకళ మాట్లాడుతూ ప్రజల్లో మార్పు తీసుకురావాలన్న సదుద్దేశంతో ప్రతీ నెల ప్రకృతి సంత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, సంస్థ వరంగల్ జిల్లా బాధ్యుడు అజిత్‌రెడ్డి, తోట ఆనందం, అనిత, బయ్యా సారయ్య తదితరులు పాల్గొన్నారు.

రమ్మీ రక్కసి

- గేమింగ్ ముసుగులో ఆన్‌లైన్ జూదం
- కేరాఫ్‌గా మారిన ఉమ్మడి వరంగల్
- 'టైంపాస్'తో మొదలు.. అప్పుల ఊబిలోకి
- ప్రాణాలు తీసుకుంటున్న యువత
- అవగాహన కల్పిస్తున్నా మారని తీరు



- 'నా ఫ్రెండ్ రూ.500 పెట్టి రూ.1,500 గెలిచాడు. నేనూ ట్రై చేశా. 5 రోజుల్లో రూ.8,000 పోయాయి. చివరికి సెల్‌ఫోన్ అమ్మేశా.' – ఇంజనీరింగ్ విద్యార్థి, వరంగల్
- 'నాకు డబ్బు రావడం ప్రారంభమైన తర్వాత ఆడి రెఫరల్ గ్రూపులు క్రియేట్ చేశా. నా అకౌంట్లో డబ్బులు జమవుతాయని మెసేజ్ వచ్చింది. ఆఖరికి నా ఖాతా ఫ్రీజ్ అయ్యింది.' – డిగ్రీ విద్యార్థి, నర్సంపేట

సాక్షిప్రతినిధి, వరంగల్:

.. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రమ్మీ గేమింగ్ యాప్‌ల సంస్కృతి పెరుగుతోంది. రమ్మీ యాప్‌లు యువత జీవితాలపై బలమైన దాడి చేస్తున్నాయి. 'గేమింగ్' ముసుగులో జూదపు బానిసత్వం విస్తృతంగా వ్యాపిస్తోంది. ఫలితంగా అనేక మంది ఈ ఉచ్చులో చిక్కుకుని అప్పులు మూటగట్టుకుంటున్నారు. వాటిని తీర్చలేక కొంతమంది చివరికి ప్రాణాలు తీసుకుంటున్నారు.

యాప్‌ల వ్యాప్తి..

ఉమ్మడి వరంగల్‌లో 2022 తర్వాత రమ్మీ యాప్‌ విష సంస్కృతి విచ్చలవిడి అయ్యింది. ప్రధానంగా నగరంలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలతోపాటు మహబూబాబాద్, జనగామ, పరకాల, నర్సంపేట తదితర పట్టణాల్లో ఈయాప్‌ల వినియోగం గణనీయంగా పెరిగింది. 'రమ్మీ కల్చర్', 'ఎ 23 రమ్మీ, వెల్త్ రమ్మీ', 'జంగిల్ రమ్మీ' .. వంటి యాప్‌లు టాప్–డౌన్లోడెడ్‌గా ఉన్నాయి. టెలిగ్రాం చానల్స్ ద్వారా '100 శాతం గెలుపు ట్రిక్స్', 'మీకు మద్దతు అందించే రమ్మీ టీచర్స్'.. తదితర పేర్లతో ఇన్‌ఫ్లుయెన్సర్లు మోసం చేస్తూనే ఉన్నారు.

మోసం ఎలా జరుగుతుందంటే?



మొదటి మూడు గేమ్‌లు గెలిచేలా ఈ యాప్‌లను రూపొందించి నమ్మకం కలిగేలా చేస్తారు. మూడు గేమ్‌ల తర్వాత చివరికి 'ఆటో బాట్' వాడడం వల్ల యూజర్ గెలిచే అవకాశం కనీస స్థాయికి దిగిపోతుంది. యూజర్ నెగ్గడం పక్కన పెడితే.. ఒక వేల గెలిచినా ఆ డబ్బును దక్కించుకోలేక పోతున్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గెలుచుకున్న డబ్బును విత్ డ్రా చేసుకోవడంలో ఆలస్యం జరిగితే పూర్తిగా నిలిపివేస్తున్నట్లు పలువురు బాధితులు తెలిపారు. కాగా.. గేమ్‌లోకి 'ఫ్రెండ్స్‌ని లాగితే రూ.100 బోనస్'.. అంటూ రెఫరల్ మాయాజాలంతో పాటు అనేక రకాలుగా వల వేస్తున్నట్లు యాప్ వాడుతున్న వారు చెబుతున్నారు.

అందరూ టార్గెటే..

యూత్ నుంచి గృహిణుల దాకా.. అన్ని వర్గాలను ఈ రమ్మీ యాప్‌లు టార్గెట్ చేస్తూ విస్తరిస్తున్నాయి. బీటెక్, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు.. ఇలా అనేక మంది ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా హనుమకొండ, కాజీపేట, వరంగల్ ట్రైసిటీ పరిధి విద్యాసంస్థల్లో చదివేవారితోపాటు ప్రైవేట్ టీచర్లు, క్లర్కులు, ఆర్థిక ఒత్తిడిలో ఉన్న వర్గాలు, గృహిణులు 'టైమ్ పాస్'గా మొదలుపెట్టి ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో భారీగా డబ్బులు కోల్పోయిన సుమారు 20 మందికి పైగా వివిధ ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

గేమ్ మాఫియా.. 'బ్రోకర్' వ్యవస్థ

ఉమ్మడి వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో రమ్మీ గేమ్ యాప్‌ల వినియోగం విచ్చలవిడిగా సాగుతున్నదని, వాటి పట్ల ఆకర్షితులు కావొద్దని సైబర్ క్రైం పోలీస్‌లు ఇప్పటికి చాలా సార్లు హెచ్చరించారు. ప్రధానంగా వరంగల్ ట్రై సిటీలో మూడు టెలిగ్రాం గ్రూపుల ద్వారా రెండు లక్షల రూపాయల వరకు రోజువారీ బెట్టింగ్ జరుగుతున్నట్లు సైబర్ పోలీసుల అనుమానం. ఈగ్రూపులకి 'మాస్టర్ బ్రోకర్లు' నిధులు సమకూరుస్తూ యువతకు 'విజయం' చూపించి మాయ చేస్తున్నట్లు సమాచారం.

హెల్ప్ డెస్క్ ప్రారంభించినప్పటికీ..

తెలంగాణ వ్యాప్తంగా సైబర్ సెల్ 2024లో 'గేమింగ్ యాప్ మోసాల'పై స్పెషల్ హెల్ప్‌లైన్ ప్రారంభించింది. డిజిటల్ డిటాక్స్ క్యాంపెయిన్ ద్వారా పదుల సంఖ్యలో కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహించాయి. అయితే యాప్‌లు విదేశీ సంస్థల ఆధీనంలో ఉండడం వల్ల వాటిపై నేరుగా చర్య తీసుకోవడం కష్టంగా మారుతోందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. తద్వారా వారించే వారికన్నా గేమ్ యాప్‌లు వినియోగించే వారే ఎక్కువవుతున్నారని ఓ పోలీస్ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

సమష్టి అవగాహన, కఠిన చర్యలు అవసరం



రమ్మీ యాప్‌ల ప్రభావం ఊహించలేనంత భయంకరంగా ఉంది. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు.. ఇలా ఎవరికీ మినహాయింపు లేకుండా ఉంది. ఈ చీకటి ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ప్రతీ విద్యాసంస్థలో సైబర్ క్రైమ్‌పై అవగాహన, మానసిక, ఆరోగ్య సదస్సులు నిర్వహించాలి. మండల స్థాయిలో మోసపోయిన యువత పునరావాసం కోసం 'డిజిటల్ బాధితుల కమిటీ' ఏర్పాటు చేయాలి. ఎవరు యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారో గుర్తించి న్యాయపరంగా వారిపై కేసులు నమోదు చేయాలి. ముఖ్యంగా విద్యాశాఖ, పోలీస్ వ్యవస్థ, న్యాయ శాఖ, మానసిక ఆరోగ్య సంస్థలు సమష్టిగా పనిచేయాలి.

– జి.కేశవులు, సీనియర్ మానసిక వైద్య నిపుణుడు

నిషేధించిన ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దు

ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం, వాటిని నిర్వహించడం చట్టరీత్యా నేరం. చర్యలు ఉంటాయి. యువత ఇటీవల ఆన్‌లైన్ గేమ్స్‌పై ఆసక్తి చూపుతోంది. ఇది సరైనది కాదు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు.. ఏ ఆటలాడుతున్నారో గమనించాలి. ఆన్‌లైన్ ఆటలకు బానిస కావొద్దు. బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు.

– కొత్త దేవేందర్ రెడ్డి, ఏసీపీ, హనుమకొండ

మాకూ కావాలి 'స్లాట్ బుకింగ్'

15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి

- ఎదురుచూస్తున్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- తగ్గనున్న పనిభారం.. సమయం ఆదా



కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన స్లాట్ బుకింగ్ పద్ధతి తమకు కూడా కావాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఆయా పరిధి భూక్రయ విక్రయదారులు కోరుకుంటున్నారు. భూ దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అడుగుపెడితే ఏ సమయానికి రిజిస్ట్రేషన్ పూర్తవుతుందో.. సబ్ రిజిస్ట్రార్ ఎప్పుడు పిలుస్తాడో తెలియక ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ప్రక్రియతో 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవడంతోపాటు మరో 15 నిమిషాల్లో దస్తావేజులు చేతికందుతున్నాయి. దీంతో స్లాట్ బుకింగ్ విధానం అమలుకు అన్ని కార్యాలయాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి వరంగల్‌ఫోర్ట్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 10న ప్రారంభించిన స్లాట్ బుకింగ్ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైంది. కోరుకున్న సమయానికి.. కోరుకున్న రోజు రిజిస్ట్రేషన్ పూర్తి కావడంతో భూక్రయవిక్రయదారులతో పాటు రుణాల కోసం బ్యాంకులకు వెళ్లే వారు సమయానికి దస్తావేజులు చేతికి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఆర్వో, భీమదేవరపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పరకాల, కొడకండ్ల, మహబూబాబాద్, ములుగు, నర్సంపేట, వర్ధన్నపేట, భూపాలపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు స్లాట్ బుకింగ్ కోసం ఎదురుచూస్తున్నాయి.

తగ్గనున్న పనిభారం

నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్న తరుణంలో సబ్ రిజిస్ట్రార్లు త్వరగా పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే ఆస్కారం లేక ఒక్కోరోజు రాత్రి 8 గంటల వరకు సైతం కార్యాలయాల్లో ఉండాల్సి వస్తోంది. స్లాట్ బుకింగ్ ప్రక్రియలో భాగంగా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని సమయాలతో సబ్ రిజిస్ట్రార్లకు పనిభారం తగ్గడంతో పాటు భూక్రయవిక్రయదారులకు సమయం కలిసి వస్తుంది.

రోజుకు 53 స్లాట్ బుకింగ్స్..

ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 24 చొప్పున స్లాట్ బుకింగ్స్ కల్పించారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులు, పేషెంట్ల కోసం ప్రత్యేకంగా సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు 5 స్లాట్ బుకింగ్స్ ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుతం రోజువారీ జరిగే రిజిస్ట్రేషన్లు ఇలా...

భీమదేవరపల్లి	20 నుంచి 30
స్టేషన్‌ఘన్‌పూర్	25 నుంచి 30
జనగామ	40 నుంచి 55
కొడకండ్ల	7 నుంచి 15
మహబూబాబాద్	45 నుంచి 60
ములుగు	10 నుంచి 20
వరంగల్ ఆర్వో	70 నుంచి 110
వరంగల్ రూరల్	25 నుంచి 35
వరంగల్‌ఫోర్ట్	25 నుంచి 40
వర్ధన్నపేట	6 నుంచి 15
నర్సంపేట	20 నుంచి 35
పరకాల	15 నుంచి 25
భూపాలపల్లి	20 నుంచి 30

స్లాట్ బుకింగ్‌తో మెరుగైన సేవలు..



భూక్రయవిక్రయదారులు తాము ఎంచుకున్న రోజు, సమయానికి దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు స్లాట్ బుకింగ్ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. మెరుగైన, త్వరితగతిన సేవలు అందుతాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేచి ఉండాల్సిన అవసరం లేదు. స్లాట్ బుక్ చేసుకుని సరైన సమయానికి వస్తే చాలు. వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారికి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక సమయం కేటాయించడంతో ఇబ్బందులు తలెత్తవు.

– ఆనంద్, సబ్ రిజిస్ట్రార్, వరంగల్‌ఆర్వో

ప్రకృతి వనాల్లో పచ్చదనం ఎక్కడ?

- నర్సంపేటలో ఎండిపోతున్న మొక్కలు.. నిర్వహణ అధ్వానం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నర్సంపేటలోని పదో వార్డు పట్టణ ప్రకృతి వనంలో కనిపించని మొక్కలు

నర్సంపేట: మున్సిపాలిటీ ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల నిర్వహణలో లోపాలు వెలుగు చూస్తున్నాయి. ఇందులో నాటిన మొక్కలు ఎండలకు ఎండిపోతున్నాయి. సిబ్బంది నీరు పట్టక పోవడంతో పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నర్సంపేట మున్సిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇందులో 14 ఖాళీ స్థలాల్లో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వనానికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించారు. ఎండలు క్రమంగా పెరిగిపోతున్నాయి. ప్రకృతి వనాల్లో వందలాది మొక్కలు నాటగా ప్రస్తుత ఎండలతో ఐదు శాతం కూడా కనిపించడం లేదు. ఏప్రిల్‌లోనే ఎండలు ఇలా ఉంటే మేలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ,

పర్యవేక్షణ విభాగం లేదు..

ప్రకృతి వనాల పర్యవేక్షణ కోసం రెండు సంవత్సరాల క్రితం బాధ్యతలు చేపట్టిన ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సంతోష్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. నాటి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అదనపు బాధ్యతలు తీసుకుని శానిటరీ సిబ్బందితో పనులు చేపడుతున్నా ఫలితం లేదు. వాస్తవానికి గ్రీన్ ఫండ్ కింద మున్సిపాలిటీ బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయిస్తున్నారు. నిధులు ఖర్చు అవుతున్నట్లు రికార్డుల్లో చూపుతున్నా ప్రకృతి వనాల్లో మొక్కలు మాత్రం కనుమరుగవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నర్సంపేట మున్సిపాలిటీలోని ప్రకృతి వనాల అభివృద్ధి కోసం అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో ఉన్న పట్టణ ప్రకృతి వనం. 2023 జూన్ 16న రూ.15 లక్షల పట్టణ ప్రగతి నిధులతో దీనిని ఏర్పాటు చేశారు. చుట్టూ ముళ్లకంచె, వాకింగ్ ట్రాక్, ఆహ్లాదకరమైన పూల మొక్కలు మొదట్లో ఉండేవి. ఇందులో ఏర్పాటు చేసిన బోరు నుంచి 10 నిమిషాలు కూడా నీళ్లు రాని పరిస్థితి. ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీటిని అందించాలనుకుంటే ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు ఇరుకుగా ఉంది. ఈ సాకుతో నీరు పోయకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి పట్టణ ప్రకృతి వనం కళావిహీనంగా కనిపిస్తోంది.

మొక్కలను కాపాడుతున్నాం..

నర్సంపేట పట్టణంలోని పట్టణ ప్రకృతి వనాలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న వసతులను వినియోగిస్తున్నాం. శానిటేషన్ సిబ్బందిని అదనంగా ఉపయోగించుకుంటూ మొక్కల పరిరక్షణకు ప్రయత్నం చేస్తున్నాం. నీటి వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పల్లె దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న పల్లె దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని తోపనపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ఆదివారం ఎమ్మెల్యే దొంతి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు దవాఖానలను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రోగులకు అవసరమయ్యే అన్ని రకాల వైద్య సేవలతోపాటు మందులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, అలంకానిపేట వైద్యాధికారులు అర్చన, అఖిల్, డెమో అనిల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

- రాయపర్తి మండలంలో ప్రారంభించిన అధికారులు
- జిల్లాలో 182 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- అందుబాటులో గన్నీ సంచులు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు



కొండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

ఖిలా వరంగల్: అన్నదాతలు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2024–2025 యాసంగి ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. కలెక్టర్ సత్యశారద ఇప్పటికే పలుమార్లు సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గన్నీ సంచులు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు, ధాన్యం రవాణా చేసేందుకు లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాల్వలు, చెరువులు, బోరుబావులు కింద సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

1.05 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు..

యాసంగి సీజన్‌లో 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వరి పంటను కోసేందుకు హార్వెస్టర్లు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు లక్షలకు పైగా గన్నీ సంచులు అవసరం ఉంటాయని గుర్తించారు. ఈసారి 1.05 లక్షల ఎకరాల్లో వరి సాగుచేయగా..కొనుగోలు కేంద్రాలకు 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. నిర్దిష్ట తేమ శాతం వచ్చాకే ధాన్యం నింపడానికి గన్నీ సంచులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి కేంద్రానికి 30 వరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచనున్నారు. వానాకాలం తరహాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయనున్నారు.

అధికారుల పర్యవేక్షణ..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధమవుతున్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, రవాణాశాఖ అధికారి శోభన్‌బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మండల వ్యవసాయాధికారులు తదితరులు ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా పరిశీలించనున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయపర్తి: కొలన్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి కోరారు. మండలంలోని కొండూరు, కేశవాపురం గ్రామాల్లో ఆదివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. వైస్ చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గజ్జి శ్రీను, వంగాల ఎల్లయ్య, తోట మమత, ముత్తడి విద్యాసాగర్, జలగం ఎల్లమ్మ, మాలోత్ దేవేందర్, అలుగోజు రమేశ్, అన్నమనేని సునీల్‌కుమార్, గుగులోత్ సోమన్న, ఆవుల కేశవరెడ్డి, ఎనబోతుల వసంత, సొసైటీ సెక్రటరీ ఎస్.యాదగిరి, రైతులు, గ్రామస్తులు కుందూరు రత్నాకర్ రెడ్డి, కొమ్ము రాజు, దేవేందర్, గుంటుక యాకన్న, పులి అంజయ్య, నేరెళ్లి మహేశ్ పాల్గొన్నారు.

ఇబ్బందులు రాకుండా చూస్తాం..



ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. జిల్లా వ్యాప్తంగా 182 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రాయపర్తి మండలం కొలనుపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కలెక్టర్ సత్యశారద ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నాం.

– సంధ్యారాణి, మేనేజర్ జిల్లా పౌరసరఫరాల శాఖ

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి : రేవూరి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: కేంద్రంలోని బీజేపీ కుట్రలు తిప్పికొట్టి, ఆ పార్టీ సర్కారు తీరు కారణంగా రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పోరాటం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ఆదివారం కాంగ్రెస్ నాయకుడు దుపాకి సంతోష్ నిర్వహించిన 'జై బాపు, జై అంబేడ్కర్, జై సంవిధాన్' ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ రాజ్యాంగాన్ని అవమానపరిచిందని ఆరోపించారు. బీజేపీ తీరుపై ప్రజలకు అవగాహన కలిగించడానికి గ్రామ గ్రామాన కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతూ, లౌకికవాదానికి తూట్లు పొడుస్తోందని అన్నారు. గరీబ్‌నగర్, కీర్తినగర్‌లో నిర్వహించిన ర్యాలీల్లో కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, నేతలు కొండేటి కొమురారెడ్డి, సాల్మన్, గోదాసి చిన్న, దాసారపు సారయ్య, జానీ, హుజూర్, చెక్క రమేశ్, ఆఫ్రీన్, శైలజ, లలిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి దారుణ హత్య

- గొడ్డలితో నరికి చంపిన దుండగులు
- ఆదివారంపేటలో ఘటన


మల్లక్క(ఫైల్)

కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఆదివారంపేటలో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఒడేటి మల్లక్క(65) కిరాణం దుకాణం నడుపుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. రోజు మాదిరిగానే శనివారం రాత్రి దుకాణం మూసివేసి నిద్రకు ఉపక్రమించింది. ఆదివారం ఉదయం కిరాణంలో పాల ప్యాకెట్లు వేయడానికి వచ్చిన వ్యక్తి మల్లక్కను పిలవగా స్పందించ లేదు. దీంతో అనుమానం వచ్చిన సదరు వ్యక్తి తలుపు తెరిచి చూడడంతో మంచం పై హత్యకు గురై ఉంది. గ్రామస్తులు, బంధువులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి గొడ్డలితో మల్లక్కను నరికి హత్యకు పాల్పడిన ఆనవాళ్లు ఉన్నాయి. కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. మల్లక్క భర్త, కుమారుడు కొంత కాలం క్రితం చనిపోగా వివాహమైన కూతురు ఉంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- రాయపల్లిలో ఘటన

రేగొండ: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని రాయపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీటూరి నీలమ్మ (59) ఉదయం స్నానానికి వాటర్ హీటర్ పెట్టుకుంది. అనంతరం పక్కన ఉన్న బ్రష్‌ను తీస్తుండగా విద్యుత్ తీగ తగిలింది. ఆ వైరు తెగి ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మహిళా రైతుపై దాడి

- నమిలిగొండలో ఘటన


మహిళారైతు యాదమ్మను భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ మహిళా రైతుపై దాడి జరిగింది. ఈ ఘటన మండలంలోని నమిలిగొండలో చోటు చేసుకుంది. బాధిత మహిళా రైతు చిక్కుడు యాదమ్మ, ఆమె భర్త పెద్దులు కథనం ప్ర కారం.. నమిలిగొండ శివారులో సర్వే నంబర్ 70/ఏలో యాదమ్మ, పెద్దులు దంపతులకు మూడెకరాల ఒక గుంట వ్యవసాయ భూమి ఉంది. ఇందులో మామిడి తోట ఉంది. ఇటీవల కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సదురు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తూ దంపతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వ్యవసాయభూమిలోకి వెళ్తుండగా అ క్కడ ఉన్న గుర్తు తెలియని మహిళా కూలీలు యాదమ్మపై దాడికి పాల్పడ్డారు. యాదమ్మ, పెద్దులు దంపతులు భూమిలోకి రాకుండా ఐదురుగు మహిళలు, ఐదుగురు పురుషులు అడ్డుకున్నారు. దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో భయభ్రాంతులకు గురైన ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మామిడి రైతన్నా.. జాగ్రత్త

వాతావరణంలో మార్పులు | ఈదురుగాలులు, వడగండ్ల వానలు

వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రోజంతా ఎండ కొట్టి.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతోపాటు ఈదురుగాలులు, వడగండ్ల వానలు కురుస్తున్నాయి. దీంతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామిడి రైతుల పరిస్థితి మరీ దారుణం. ప్రస్తుతం వీస్తున్న ఈదురుగాలులతో మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కత్తుల నాగరాజు రైతులకు వివరిస్తున్నారు.


కాయలతో ఉన్న మామిడి చెట్టు


ఆంత్రక్నోస్ మచ్చ తెగులు మామిడి


కత్తుల నాగరాజు, శాస్త్రవేత్త

మహబూబాబాద్ రూరల్ : అకాల వర్షాల సమయంలో మామిడి తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో గల జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కత్తుల నాగరాజు వివరించారు. ప్రస్తుతం మామిడి పండ్లు అభివృద్ధి దశలో ఉన్నాయని, అకాల వర్షాలు కురిసినప్పుడు, కురిసిన తర్వాత రైతులు మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలియజేశారు.

- వర్షం వచ్చిపోయాక 24 గంటలలోపు నీటిని బయటకు పంపాలి. నీరు నిల్వకుండా ఎత్తయిన కట్టలతో సరైన పారుదల సౌకర్యాన్ని అందించాలి.
- గాలికి దెబ్బతిన్న కొమ్మలను కత్తిరించి కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా బోర్డో పేస్ట్ పూయాలి.
- తెగుళ్ల వ్యాప్తికి అనుకూలంగా ఉండే పడిపోయిన పండ్లను సేకరించి దూరంగా నాశనం చేయాలి.
- వర్షం కారణంగా పక్షి కన్ను తెగులుతోపాటుగా బాక్టీరియా వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. వాటిని 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా, అవసరాన్ని బట్టి స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ కాంబినేషన్ 6 గ్రాముల మందు 60 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా నియంత్రించొచ్చు.
- అధిక వర్షపాతం వల్ల అన్ని రకాల రసం పీల్చే (పిండినల్లి, తేనెమంచు పురుగులు) తెగుళ్ల బారినపడే అవకాశం ఉంది. వర్షం ఆగిపోయిన తర్వాత ఇమిడా క్లోప్రిడ్ 1 మిల్లీ లీటరు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా 2 మిల్లీ లీటర్లు క్లోరోపైరిఫాస్ లీటర్ నీటికి కలిపి పురుగు మందులను పిచికారీ చేయాలి.
- మామిడిలో తామరపురుగులు వర్షాలకు అనుకూలంగా ఉంటాయి. కాబట్టి ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- తడి, తేమ కారణంగా, పండ్ల ఈగలు గుడ్లు పెట్టే అవకాశాలు ఉన్నాయి. తోటల్లో పండ్ల ఈగ (ఎర) ఉచ్చులను ఏర్పాటు చేయడం ద్వారా దీనిని పర్యవేక్షించొచ్చు. (ఎకరానికి 10 నుంచి 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి).
- తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు, అధిక పగటి ఉష్ణోగ్రతలు ఉద్యాన పంటలపై బూజు తెగులుకి కారణం అవుతాయి. లీటర్ నీటికి హెక్సాకోనజోల్ మిల్లీ లీటరు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఉపశమనం ఉంటుంది.
- వడగండ్ల వాన నుంచి పండ్ల నష్టాన్ని నివారించడానికి పండ్లను పండ్ల సంచులతో కప్పాలి.
- వడగండ్ల వాన ప్రభావిత ప్రాంతంలో వర్షాల అనంతరం పొటాషియం నైట్రేట్ 10 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అర్ధశతాబ్దపు 'అపూర్వ' కలయిక



వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హన్మకొండ చౌరస్తా : ఐదు దశాబ్దాల క్రితం వారందరూ విద్యార్థులు. నేడు పిల్లలు, మనుమలు, మనుమరాళ్లతో జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. వాటన్నింటినీ మరిచిపోయి ఆదివారం మళ్లీ విద్యార్థులుగా మారి రోజంతా సంతోషంగా జరుపుకున్నారు. అందుకు లష్కర్‌బజార్‌లోని ఎల్‌బీహెచ్‌ఎస్ వేదికగా నిలిచింది. 1974–75లో ఎల్‌బీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల అపూర్వ కలయిక రిటైర్డ్ ఎస్సై జి.నర్సయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. నాటి గురువుల పాండురంగాచారి, ఐలయ్య, పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎంలు జగన్, వెంకటేశంను సన్మానించారు. కాగా, సమ్మేళనంలో నెల్లూరు, కాకినాడ, హైదరాబాద్, మంచిర్యాల, కరీంనగర్, ఏటూరు నాగారం, ములుగు ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కలుసుకున్నారు. పరిటాల సుబ్బారావు, సత్య సుబ్రహ్మణ్యం, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందలో గుడిసె దగ్ధం



వర్ధన్నపేట: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గుడిసె దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కడెం రాజు, ఆయన తండ్రి మల్లయ్య గుడిసె వేసుకుని పాత ఇనుప సామాను కొనుగోలు, అమ్మకంతోపాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాజు భార్య దేవుడికి దీపం వెలిగించి తాగునీరు తీసుకురావడానికి బయటకు వెళ్లింది. ఇంతలో దీపం మంటలు అంటుకుని చెలరేగి గుడిసె లోపల ఉన్న బట్టలు, బియ్యం, దాచుకున్న డబ్బులు రూ.15 వేలు కాలిపోయాయి. గ్రామస్తులు బిందెలతో నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. రాజు కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని స్థానికులు కోరారు.

దమ్మన్నపేటలో విద్యుదాఘాతంతోఇల్లు..

రేగొండ: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..బండి అశోక్‌తో పాటు కుటుంబ సభ్యులు ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంటి నుంచి పొగ, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు పరకాల అగ్ని మాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.అప్పటికే నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో సుమారు రూ. 3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

27న రాష్ట్ర స్థాయి పారా తైక్వాండో పోటీలు


సమావేశానికి హాజరైన వివిధ జిల్లాల పారాతైక్వాండో అసోసియేషన్ కన్వీనర్లు

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఈ నెల 27వ తేదీన తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మెన్, ఉమెన్ పారా తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ కుమార్ తెలిపారు. హనుమకొండ భీమారం సమీపంలో విహారీ హోటల్‌లో ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు చెన్నైలో మే నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ వెంకటేశ్, వరంగల్ జిల్లా కన్వీనర్లు గణేశ్‌యాదవ్, దిలీప్, గౌతమ్, జనగామ భాస్కర్, ఖమ్మం వెంకటేశ్, ఆదిలాబాద్ అతుల్‌కుమార్, నిజామాబాద్ మనోజ్, మహబూబ్‌నగర్ కన్వీనర్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


వాజేడు: మండల పరిధిలోని పావిరాల వాగు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. వెంకటాపురం(కె) మండల పరిధిలోని వీరభద్రారం గ్రామానికి చెందిన రామ్‌చరణ్, సంజయ్ వాజేడు వైపు నుంచి జాతర వైపునకు వెళ్తున్నారు. అదే సమయంలో కదేకల్ గ్రామానికి చెందిన మనోజ్ జాతర వైపు నుంచి కడేకల్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలు కాగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించి చికిత్స నిమిత్తం ముగ్గురిని వైద్యశాలకు తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: తనను పెళ్లి చేసుకుని ఇప్పుడు కాదంటున్నాడని ఆరోపిస్తూ ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. కాజీపేట బాపూజీనగర్ ప్రాంతంలో నివాసం ఉండే బామండ్లపల్లి స్రవంతికి మహబూబాబాద్ మండలం ఉత్తర తండా గ్రామపంచాయతీ పరిధిలోని నేతాజీ తండాకు చెందిన బానోతు దస్రు, సోనీ దంపతుల కుమారుడు వెంకట్‌తో మార్చి 19వ వివాహం జరిగింది. ప్రస్తుతం తనను వద్దని, వెంకట్ మరో యువతితో వివాహం నిశ్చయించుకోగా.. అలా ఎందుకు చేస్తున్నావని అడిగితే పట్టించుకోవడం లేదు. ఈవిషయమై పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం రమ్మంటే పట్టించుకోకపోవడంతో మనోవేదన గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

విద్యార్థిని బలవన్మరణం

- మానుకోటలో ఘటన
- మరో రెండు రోజుల్లో డిగ్రీ పరీక్షలు
- అంతలోనే అనంతలోకాలకు..


తరంగిణి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మరో రెండు రోజుల్లో డిగ్రీ వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా ఓ విద్యార్థి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పర్వతపు ఈశ్వరాచారి, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు తరంగిణి (20), మౌనికశ్రీ ఉన్నారు. ధనలక్ష్మి 15 సంవత్సరాల క్రితం మృతి చెందింది. దీంతో ఆ ఇద్దరు అమ్మాయిలు చిన్నప్పటి నుంచి మహబూబాబాద్‌లోని ఆర్టీసీ కాలనీలో తమ పెద్దమ్మ,పెద్దనాన్న వంగాల పరమేశ్వరాచారి, జయప్రద ఇంటి వద్ద ఉండి చదువుకుంటున్నారు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో తరంగిణి బీఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. ఈనెల 15వ తేదీ నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం కానుండగా ఆదివారం తన తండ్రి ఈశ్వరాచారికి ఫోన్ చేసి మానుకోటకు ఎప్పుడు వస్తున్నావని అడిగింది. ఈ క్రమంలో పరమేశ్వరాచారి ఉదయం తమ బంధువుల ఇంట్లో వివాహం ఉండగా అక్కడికి వెళ్లారు. దీంతో ఎవరూలేని సమయంలో తరంగిణి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సాయంత్రం చుట్టుపక్కల వాళ్లు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టగా స్పందించలేదు. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా తరంగిణి ఉరేసుకుని కనిపించింది. వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు తెలియజేయడంతో టౌన్ ఎస్సై కె. శివ, హెడ్ కానిస్టేబుల్ దామోదర్ ఘటనా స్థలికి చేరుకుని తరంగిణి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఈశ్వరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ దేవేందర్ పేర్కొన్నారు. కాగా, శనివారం రాత్రి తరంగిణి ఎవరితోనో ఫోన్‌లో ఘర్షణ పడినట్లు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు సమాచారం.

జిల్లా కేంద్రంలోనే వివాహిత..

మహబూబాబాద్ రూరల్ : ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన శ్రీపాద రవిచంద్ర, నవ్య దంపతులు కొద్ది నెలల క్రితం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి స్థిరపడ్డారు. నర్సంపేట బైపాస్ రోడ్‌లో రెడీమేడ్ షాప్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వివాహ వేడుకకు హాజరై సాయంత్రం వచ్చారు. రవిచంద్ర షాపులో ఉండగా నవ్య ఇంట్లోకి వెళ్లింది. ఈ క్రమంలో రవిచంద్ర ఇంట్లోకి వెళ్లి చూడగా నవ్య ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడి కనిపించింది. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకుని నవ్య మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, నవ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ దేవేందర్ పేర్కొన్నారు.

డ్యూటీలు వేస్తున్న నాయకుడు!


భద్రపరిచే గదిలో కానరాని మొత్తం పీఓఎస్ మిషన్లు


వరంగల్ వ్యవసాయ మార్కెట్


డ్యూటీల నమోదు రిజిస్టర్‌తో నాయకుడు

- దడువాయిల ఇంటికి పీఓఎస్ మిషన్లు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్ అధికారులు
- భేదాభిప్రాయాలతో సంఘం కార్యదర్శి రాజీనామా

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పాలన అస్తవ్యస్తంగా మారింది. యార్డుల్లోకి విక్రయానికి వస్తున్న మిర్చిని దడువాయిలు పీఓఎస్ మిషన్లలో నమోదు చేసి లాట్ ఐడీలను రైతులకు అందిస్తారు. యార్డుల్లో దడువాయిలు ఎక్కడ విధులు నిర్వర్తించాలో అన్ని గుర్తించి వారికి పీఓఎస్ మిషన్లను మార్కెట్ సూపర్‌వైజర్లు అందజేస్తారు. పీఓఎస్ మిషన్ల నిర్వహణ మొత్తం ఓ సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తుంటారు. సూపర్‌వైజర్లు, దడువాయి యూనియన్ నాయకుడు మిలాఖత్ కావడంతో డ్యూటీల బాధ్యతలు అతడికే అప్పగించినట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుడు తనకు నమ్మకం, ఇష్టమైన వారికి ఆదాయం ఉన్న ప్రాంతాల్లో డ్యూటీలు వేయడంతో సంఘంలోని నేతల మధ్య భేదాభిప్రాయాలు నెలకొన్నట్లు తెలిసింది. ముఖ్యంగా మార్కెట్‌లో జీరో దందా జరుగుతున్న ప్రాంతాలను తన అనుయాయులకు అప్పగించడంతోనే తేడాలు వచ్చినట్లు తెలిసింది. ఆదాయం ఉన్న ప్రాంతాలు రోజూ తన వారికే కేటాయించడంతో మిగిలిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే ప్యానల్ నుంచి గెలిచినప్పటికీ ప్రతిపక్ష ప్యానల్‌కు చెందిన వారికి మంచి ప్రాంతాల్లో డ్యూటీలు వేయడం సంఘంలోని మరో నాయకుడికి మింగుడు పడడం లేదు. ఈ వ్యవహారం ముదరడంతో దడువాయిల సంఘం ప్రధాన కార్యదర్శి సోల రవి నాలుగు రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేసినా పట్టించుకోకపోవడంపై మిగతా వారి నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. రాజీనామాపై రవిని వివరణ కోరగా ఒకే ప్యానల్ నుంచి గెలిచినా పోటీ నాయకుడితో కమ్మక్కు కావడం, తనకు అడ్డుతగలడంతో మనస్తాపానికి గురై పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. దీనికి తోడు దడువాయిలు ఆదివారం విహార యాత్రకు వెళ్లినట్లు తెలిసింది. ప్రతి ఏడాది ఒక రోజు విహార యాత్రకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుందని కొందరు తెలిపారు.

ఇంటికి పీఓ మిషన్లు..

మార్కెట్‌లోని యార్డులకు వచ్చిన సరుకులను దడువాయిలు నమోదు చేస్తారు. మార్కెట్ పరిధిలో మొత్తం 125 మంది దడుయిలు ఉన్నారు. వీరు ప్రతీరోజు యార్డులకు వచ్చిన సరుకులను మిషన్లలో నమోదు చేసి లాట్ ఐడీలను రైతులకు అందించేందుకు పీఓఎస్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. పాత పీఓఎస్ మిషన్లు 50 ఉండగా కొత్త మూడు విడుతల్లో 40 మిషన్లు తెప్పించారు. నిబంధనల ప్రకారం దడువాయిలు ఉపయోగిస్తున్న పీఓఎస్ మిషన్లు విధులు ముగిసిన వెంటనే కార్యాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. పీఓఎస్ మిషన్లు చార్జింగ్ పెట్టడం, నిర్వహణ, డ్యూటీలు వేసేందుకు ప్రత్యేకంగా ఓ సూపర్‌వైజర్‌కు అప్పగించినట్లు సమాచారం. దడువాయి నాయకుడు, యార్డుల్లోని సూపర్‌వైజర్లు ఒక్కటి కావడంతో డ్యూటీలను నాయకుడు వేయడంపై ఆరోపణలు తలెత్తుతున్నాయి. డ్యూటీలు వేస్తున్న సమయంలో మార్కెట్ యార్డు గది తలుపులు వేయడంపై దడువాయిలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్యూటీలు వేసే విషయం తెలియకుండా ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. డ్యూటీలు ముగిసినా దడువాయిలు పీఓఎస్ మిషన్లు ఇంటికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పొచ్చు. ఇలా మిషన్లు ఇంటికి తీసుకుపోతే లాట్ ఐడీలను అదనంగా జారీ చేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యార్డుల్లో డ్యూటీలను అధికారులే వేసేలా చర్యలు చేపట్టాలని దడువాయిలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: మంథని నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి నిరంతరం పరితపించిన దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద గల ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఎల్ఎం గార్డెన్స్‌లో పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో వైద్య, విద్య, రవాణాలాంటి మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడానికి శ్రీపాదరావు కృషి చేశారన్నారు. తన తండ్రి శ్రీపాదరావు స్ఫూర్తితో పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కటుకం మృత్యుంజయం, 'సూడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, దండ్రు రమేశ్, బాన్సోడ రాణిబాయి పాల్గొన్నారు.

వడగళ్లతో పంట పాడైందని మనస్తాపం..

- రైతు ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి


నర్సింహారావు(ఫైల్)

మంగపేట: వడగళ్ల వానకు 15 ఎకరాల వరి పంట చేతిరాకుండాపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న గిరిజన రైతు యాలం నర్సింహారావు(45) ఆదివారం మృతి చెందాడు. మండలంలో ఈనెల 7న వడగళ్ల వానకు మల్లూరు, నర్సింహాసాగర్ తదితర గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. పంట నష్ట పరిశీలనకు వచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు మల్లూరు జీపీ పరిధిలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన నర్సింహారావు తనకు జరిగిన నష్టాన్ని వివరించి న్యాయం చేయాలని వేడుకున్న విషయం విధితమే. ప్రభుత్వం ద్వారా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినా 15 ఎకరాల్లో జరిగిన నష్టాన్ని తలుచుకుని నర్సింహారావు మనస్తాపంతో ఈనెల 10న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మూడు రోజుల నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు కవిత, కుమారుడు కల్యాణ్ ఉన్నారు. కాగా, నర్సింహారావు మృతి చెందాడనే విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో తాను పరామర్శించిన రైతు రెండు రోజులు గడవక ముందే మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఆస్పత్రి బిల్లును మంత్రి స్వయంగా క్లియరెన్స్ చేయించారు. మృతదేహాన్ని బాధిత కుటుంబానికి అందజేసేందుకు ప్రత్యేక చొరవ చూపారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నుంచి ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం త్వరితగతిన పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

తల్లులకు తనివితీరా మొక్కులు

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం మేడారానికి పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద భక్తుల పుట్టువెంట్రుకలు సమర్పించి స్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తుబంగారం, ఒడిబియ్యం, గాజులు, పూలు, పండ్లు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. సుమారు 10వేల మంది భక్తులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్, బాలకృష్ణ భక్తులకు సేవలందించారు.

కిక్కిరిసిన తల్లుల గద్దెలు

అమ్మవార్ల దర్శనానికి ఉదయం 8గంటల నుంచే భక్తుల తాకిడి పెరిగింది. భక్తుల రద్దీతో సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మొక్కులు చెల్లించుకునేందుకు గద్దెల వద్ద పోటీ పడ్డారు. దొంగలు చేతివాటం ప్రదర్శించకుండా పోలీసులు గద్దెల వద్ద చర్యలు తీసుకున్నారు. ఎండోమెంట్ అధికారులు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. భక్తుల రద్దీతో మేడారం సందడిగా కనిపించింది. దర్శనాల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. కాగా, సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో మేడారంలో భారీ వర్షం కురియడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



తల్లుల దర్శనానికి క్యూలో వస్తున్న భక్తులు


గద్దెల ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న ఎండోమెంట్ సిబ్బంది